بِسۡمِ اللّٰہِ الرَّحۡمٰنِ الرَّحِیۡمِ    نَحۡمَدُہٗ وَنُصَلِّیۡ عَلٰی رَسُوۡلِہِ الۡکَرِیۡمِ    وَعَلٰی عَبۡدِہِ الۡمَسِیۡحِ الۡمَوۡعُوۡدِ

**Summary of Friday Sermon Hazrat Khalifatul Masih V, 10.01.2025 (Telugu)**

# సరియ్యా బనూ ఫజారా, సరియ్యా అబ్దుల్లాహ్ బిన్ అతీక్ నేపథ్యంలో మహా ప్రవక్త హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం జీవిత చరిత్ర ప్రస్తావన

హజ్రత్ అమీరుల్ మోమినీన్ ఖలీఫతుల్ మసీహిల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ 10.01.2025 తేదీన – మస్జిద్ ముబారక్ ఇస్లామాబాద్, టిల్‌ఫోర్డ్, లండన్, ఇంగ్లాండ్‌లో ప్రసంగించిన ఖుత్బా జుమా సారాంశము

أَشْهَدُ أَنْ لَا إِلٰهَ إِلَّا اللّٰهُ وَحْدَهُ لَا شَرِيْكَ لَهُ وَأَشْهَدُ أَنَّ مُحَمَّدًا عَبْدُهُ وَرَسُوْلُهُ أَمَّا بَعْدُ فَأَعُوْذُ بِاللّٰهِ مِنَ الشَّيْطٰنِ الرَّجِيْمِ۔ بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ۔ اَلْحَمْدُ لِلّٰهِ رَبِّ الْعٰلَمِيْنَ۔ الرَّحْمٰنِ الرَّحِيْمِ۔ مٰلِكِ يَوْمِ الدِّيْنِ۔ اِيَّاكَ نَعْبُدُ وَاِيَّاكَ نَسْتَعِيْنُ۔ اِهْدِنَا الصِّرَاطَ الْمُسْتَقِيْمَ۔ صِرَاطَ الَّذِيْنَ اَنْعَمْتَ عَلَيْهِمْ غَيْرِ الْمَغْضُوْبِ عَلَيْهِمْ وَلَا الضَّآلِّيْنَ۔

---

తషహ్హుద్, తఅవ్వుజ్, ఫాతిహా అధ్యాయం పఠనానంతరం హుజూరె అన్వర్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ ఇట్లు ఉపదేశించారు. గత ఖుత్బా కంటే ముందు మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం కాలపు సరాయా, ఘజ్వాలు (యుద్ధాల) ప్రస్తావన జరుగుతుండెను. అందులో బనూ ఫజారా యుద్ధ ప్రస్తావన జరిగెను.

చరిత్రలో బనూ ఫజారాకు విరుద్ధంగా జరిగిన సరియ్యాలోని ఒక సంఘటన ప్రస్తావన లభిస్తుంది. అనగా ఉమ్మె ఖిర్ఫ స్త్రీ హత్య సంఘటన. కొందరు చరిత్రకారులు దీనిని వ్రాసిన విధానాన్ని బట్టి ఇది వాస్తవ విరుద్ధ సంఘటన అని తెలుస్తుంది. ఈ సంఘటనను హజ్రత్ మిర్జా బషీర్ అహ్మద్ (రజి) గట్టి నిదర్శనాలతో ఎంతో ఉత్తమ రీతిలో ప్రస్తావించారు. వారిట్లు వ్రాశారు. సరియ్యా హజ్రత్ అబూబక్ర్ (రజి) బదులు ఇబ్నె సాద్ ఒక సరియ్యాను ప్రస్తావించారు. అందులో జైద్ బిన్ హారిస (రజి) సైన్యాధికారిగా నియమించబడిరి. అనగా ఈ సరియ్యాలో హజ్రత్ అబూబక్ర్ (రజి) బదులుగా జైద్ బిన్ హారిస (రజి) ను సైన్యాధికారిగా ఇబ్నె సాద్ వ్రాశారు. వివరాలతో కూడ కొంత విభేదిస్తూ ఇట్లు వ్రాసెను. ఈ సరియ్యా వాదియుల్ ఖురా వద్ద నివాసమున్న బనూ ఫజారాను శిక్షించుటకు జరిగెను. వీరు ముస్లింల ఒక వ్యాపార బృందంపై రహస్యంగా దాడి చేసి ఆ బృందపు ధనంతో పాటు మొత్తం సామాగ్రిని దోచుకొనిరి. అశాంతి సృష్టిస్తున్న ఈ పక్షానికి ఒక వృద్ధురాలు ముఖ్య కారణమైనది. ఆమె పేరే ఉమ్మె ఖిర్ఫ. ఆమె ఇస్లాంకు బద్ధ శత్రువురాలిగా ఉండెను. ఈ యుద్ధంలో ఈ మహిళ పట్టుబడినప్పుడు జైద్ బృందంలోని ఖైస్ నామం గల ఒక వ్యక్తి ఆ మహిళను హత్య చేసెను. ఇబ్నె సాద్ ఈ హత్య సంఘటనను ఇట్లు ప్రస్తావించెను. ఆమె రెండు కాళ్లను రెండు వేర్వేరు ఒంటెలకు కట్టటబడెను. అనంతరం ఆయా ఒంటెలను విభిన్న దిశలకు పరుగెత్తించెను. దాని ఫలితంగా ఈ మహిళ చీరబడి రెండు ముక్కలయ్యెను. అనంతరం సల్మ బిన్ అక్వకు ఈ మహిళ కూతురు అప్పగించబడెను. ఇదే సంఘటనను కొంత భిన్నంగా, మరో రకంగా సంక్షిప్తంగా ఇబ్నె ఇస్‌హాక్ కూడ ప్రస్తావించెను.

హజ్రత్ మిర్జా బషీర్ అహ్మద్ గారు (రజి) ఇట్లు వ్రాశారు. ఈ సంఘటన పూర్తిగా వాస్తవ

విరుద్ధమైనది. నిరాధారమైనది. వివేకపరంగా, గత సంఘటనల పరంగాను ఇది కల్పితమని రుజువగుతుంది. వివేకపరంగా అర్థం చేసుకోవలసిన విషయమేమనగా హత్య ఆరోపణ లేని ఒక మహిళను బంధించి, యుద్ధం జరగని సమయంలో హత్య చేయుట, ఆ హత్య కూడ కథనంలో వివరించిన పద్ధతిలో హత్య చేయుట ఊహకందని విషయం. రణరంగంలో కూడ ఒక స్త్రీని హత్య చేయకూడదని ఒస్లాం గట్టిగా ఆదేశిస్తుంది. స్త్రీలను హత్య చేయకూడదని అనేక సందర్భాలలో మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం స్పష్టంగా ఆదేశించారు. హదీస్‌లో ఇట్లు గలదు. ఒక సందర్భంన రణరంగంలో ఒక శత్రువుల తెగకు చెందిన మహిళ హత్యకు గురై లభించెను. ఈ స్త్రీ ఎవరు, ఎటువంటి స్థితిలో, ఎవరి చేతిలో హతమైనదో తెలియదు. అయినను వారు సల్లల్లాహు అలైహి వసల్లం నా మృతురాలిని చూసి చాలా అసంతృప్తికి గురైనారు. అనుచరులను గట్టిగా ఇట్లు ఆదేశించారు. ఇలా భవిష్యత్తులో జరగకూడదు. ఇదే విధంగా మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఎప్పుడైనా ఒక సైన్యంను పంపినప్పుడు ఇతర ఆదేశాలతోపాటు అనుచరులకు స్త్రీలను, పిల్లలను హత్య చేయకూడదని ఉపదేశించేవారు.

ఈ ప్రాథమిక సూత్రాలు ఉండగా అనుచరుల గురించి, అనుచరులలో కూడ దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం కుటుంబ మనిషిగా భావించబడే జైద్ బిన్ హారిస (రజి) గురించి ఇలా భావించుట అనగా ఒక స్త్రీని ఇబ్నె సాద్ ప్రస్తావించిన పద్ధతిలో హత్య చేసినట్లు లేదా చేయించినట్లు భావించుట ఆమోదయోగ్యం కానే కాదు. కథనాలలో హత్యను జైద్‌కు అంటగట్టలేదు. కాని దీనికి అసలు బాధ్యులు జైద్ అనే భావించబడును. మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం బోధన తెలిసినను ఇటువంటి పనికి అనుమతించుటను జైద్ గురించి ఎన్నటికి ఆమోదించలేము.

ఇక మిగిలింది గత సంఘటనలపై ఆధార పడిన పద్ధతి. మొదటి విషయమేమనగా ఇబ్నె సాద్ లేదా ఇబ్నె ఇస్‌హాక్ ఈ కథనంకు ఎలాంటి సనద్ (నమ్మకమైన వ్యక్తి సాక్ష్యం) వ్రాయలేదు. ఎలాంటి నమ్మకమైన సనద్ లేనిదే మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం స్పష్టమైన ఆదేశంనకు, అనుచరుల ప్రముఖ పద్ధతికి విరుద్ధమైన ఇటువంటి కథనం ఎన్నటికి ఆమోదయోగ్యం కాదు. రెండవ విషయం ఏమనగా ఇదే సంఘటన నమ్మకమైన హదీస్ పుస్తకాలు అనగా సహీ ముస్లిం, సునన్ అబూదాఊద్‌లో ప్రస్తావించబడింది. కాని ఇందులో ఉమ్మె ఖిర్ఫ హత్య చేయబడిన విషయం ఏమాత్రం ప్రస్తావించబడలేదు. కొన్ని ఇతర వివరాలలో కూడ ఈ సంఘటన ఇబ్నె సాద్ మొదలగు కథనాలకు భిన్నంగా ఉన్నది.

సరియైన చారిత్రక అధిక కథనాలకు నిశ్చయంగా, ఏకాభిప్రాయంగా అధిక ప్రాధాన్యత ఇవ్వబడును. ఇందుకే సహీ ముస్లిం, సునన్ అబూదాఊద్ కథనం ఉండగా ఇబ్నె సాద్ మొదలగు కథనంకు ప్రాధాన్యత ఇవ్వబడదు. ఇబ్నె సాద్, ఇబ్నె ఇస్‌హాక్ తమ కథనాలను సనద్ లేకుండా ప్రస్తావించగా ఇమామ్ ముస్లిం, అబూదాఊద్ తమ కథనాలను పూర్తి సనద్‌లతో ప్రస్తావించినందున ఈ అభిప్రాయం మరింత ప్రాధాన్యత సంతరించుకుంటుంది. ఎంతో జాగ్రత్త వహించిన హదీస్ రచయితలతో పోల్చినచో చరిత్రకారుల సాధారణ కథనాలకు ఎలాంటి ప్రాముఖ్యత లేదు. కావున ఉమ్మె ఖిర్ఫ క్రూరమైన హత్య

సంఘటన పూర్తిగా అసత్యమైనది, నిరాధారమైనదను విషయంలో ఎలాంటి సంశయం లేదు. ఇది ఇస్లాం రహస్య శత్రువు, దాంబికుని నిర్వాకం వలన కొన్ని చరిత్ర కథనాలలో పొందుపర్చబడెను. ముస్లిం, అబూదాఊద్ ప్రస్తావించిన దాని కంటే ఎక్కువ ఈ సరియ్యకు ఎలాంటి ప్రాముఖ్యత లేదు.

మరో సరియ్య అబ్దుల్లాహ్ బిన్ అతీక్ గురించి చరిత్రలో ప్రస్తావన లభిస్తుంది. ఇది అబూ రాఫి గురించి గలదు. ఈ సరియ్య హిజ్రీ ఆరవ సం॥లో జరిగినట్లు ఇబ్నె సాద్ వ్రాసెను.

దీని వివరాలను హజ్రత్ మిర్జా బషీర్ అహ్మద్ గారు (రజి) ఇట్లు వ్రాశారు. హిజ్రీ ఐదవ సం॥ చివరలో ఏ యూద నాయకుల పీడనపు ప్రేరణ వలన ముస్లింలకు విరుద్ధంగా అహ్‌జాబ్ యుద్ధం సంభవించెనో వారిలో హుయ్యి బిన్ అక్తబ్ బనూ ఖురైజ సందర్భంన హత్యకు గురయ్యెను. కాని సలాం బిన్ అబీల్ హకీక్ ఉర్ఫ్ అబూ రాఫి ఇంకా ఖైబర్ ప్రాంతంలో గతం మాదిరిగానే స్వతంత్రంగా అశాంతి కార్యకలాపాలకు పాల్పడుతుండెను. ఇంతేకాక అహ్‌జాబ్ అవమానకర ఓటమి, బనూ ఖురైజ భయంకర ఫలితం వలన ఇతని శత్రత్వం మరింత పెరిగెను. ఘత్ఫాన్ తెగల నివాసం ప్రాంతం ఖైబర్ సమీపంలో ఉండెను. ఖైబర్ యూదులు మరియు నజద్ తెగలు ఇరుగు పొరుగున ఉండెను. చాలా పెద్ద వ్యాపారస్తుడు, గొప్ప ధనికుడైన అబూరాఫి వరుసగా నజద్ అనాగరిక, యుద్ధంలో ఆరితేరిన తెగలను ముస్లింలకు వ్యతిరేకంగా ప్రేరేపిస్తుండెను. మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంతో శత్రుత్వంలో ఇతడు కాబ్ బిన్ అష్రఫ్‌కు తగ్గట్టుగా ఉండెను. అహ్‌జాబ్ యుద్ధం మాదిరిగా ఇతడు ఘత్ఫాన్‌తో పాటు ఇతర తెగలను సందర్శించడం మొదలు పెట్టి ముస్లింలను నాశనం చేయుటకు ఒక పెద్ద సైన్యంను సమకూర్చడం ప్రారంభించెను. పిరిస్థితి ఇంత వరకు చేరినప్పుడు ముస్లింలకు మరల అహ్‌జాబ్ దృశ్యం కనిపించసాగెను. దేశంలో విస్తృత స్థాయిలో రక్త పాతం సంభవించే కంటే ఒక కుట్రదారుడు, అశాంతి కారకుడు హత్యకు గురి కావడం మంచిదని భావించి దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం అబ్దుల్లాహ్ బిన్ అతీక్ నాయకత్వంలో నలుగురు ఖజ్రజీ అనుచరులను అబూరాఫి వద్దకు పంపిరి. కాని పంపుతున్నప్పుడు స్త్రీని, పిల్లలను హత్య చేయకూడదని ఆదేశించిరి. కావున ఆరవ హిజ్రీ సం॥ రమజాన్ నెలలో ఈ బృందం బయలు దేరెను. ఎంతో చాకచక్యంగా తమ పనిని పూర్తి చేసుకొని తిరిగి వచ్చెను. ఇలా ఈ ఆపద నుండి మదీనాను ఈ బృందం రక్షించెను.

అబూ రాఫి హత్య తర్వాత అతని కోటలో ఉన్న గృహ మెట్ల నుండి త్వర త్వరగా దిగి వస్తుండగా అబ్దుల్లాహ్ బిన్ అతీక్ మోకాలు విరిగి పోయెను. (మోకాలి అతుకు విడిపోయెనని మరో కథనంలో గలదు.) వారు (రజి) స్వయంగా ఇట్లు తెలిపిరి. మేము మదీనాకు చేరుకొని మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంకు అబూ రాఫి హత్య సమాచారం అందించితిమి. వారు సల్లల్లాహు అలైహి వసల్లం మొత్తం సంఘటన విన్న తర్వాత తన కాలు ముందుకు సాపమని నన్ను ఆదేశించిరి. నేను కాలు ముందుకు సాపగా వారు సల్లల్లాహు అలైహి వసల్లం ప్రార్థన చేస్తూ తమ పవిత్ర హస్తంతో దానిపై రుద్దిరి. ఆ తర్వాత నాకేదైనా బాధ కలిగిందా లేదా అనే భావన కూడ నాకు లేకుండెను.

హజ్రత్ మిర్జా బషీర్ అహ్మద్ గారు (రజి) ఇట్లు వ్రాశారు. అబూరాఫి హత్య ధర్మబద్ధమా కాదా అనే చర్చకు మనం దిగాల్సిన అవసరం లేదు. ఎందుకనగా అబూ రాఫి రక్తపాతంతో కూడిన కార్యకలాపాలు చరిత్రలో స్పష్టంగా గలవు.

ఈ పరిస్థితులలో అనుచరులు చేసిన పని పూర్తిగా ధర్మబద్ధమైనదే. యుద్ధ పరిస్థితిలో ఒక జాతి జీవన్మరణ పరిస్థితిని ఎదుర్కొంటున్నప్పుడు ఇటువంటి ప్రణాళికలను అనుసరించుట సమంజసంగానే భావించబడును. ప్రతి జాతి, దేశం తమకు ఎదురైన స్థితులను బట్టి ఇలాంటి చర్యలు చేపడుతుంది. కాని విచారమేమనగా సత్ప్రవర్తనలు దిగజారిన ప్రస్తుత కాలంలో నేరస్తునితో సానుభూతి భావం ఎంత అనుచిత స్థాయికి చేరిందనగా ఒక క్రూరుడు కూడ వీరునిగా మారుతున్నాడు. తాను తన నేరాల వలన పొందుతున్న శిక్ష సమయంలో ప్రజల సానుభూతి పొందుతున్నాడు. అతని నేరాలను ప్రజలు మరచి పోతారు. కాని ఇస్లాం అసత్య భావాల ధర్మం కాదని మేము అంగీకరిస్తున్నాము. అది నేరస్తున్ని నేరస్తునిగా పరిగణిస్తుంది. అతని శిక్షను దేశం, సమాజానికి కరుణగా భావిస్తుంది. కుల్లిపోయిన అవయవంను శరీరం నుండి కోసివేయుటనే మంచిదని బోధిస్తుంది. ఆ కుల్లిపోయిన అవయవం ఆరోగ్యంగా ఉన్న ఇతర అవయవాలను చెడగొట్టుటకు ఇస్లాం నిరీక్షించదు. శిక్షించిన విధానం గురించి ఏర్పడుతున్న ప్రశ్నకు సమాధానమేమనగా అరబ్‌లోని అప్పటి పరిస్థితుల దృష్ట్యా, ముస్లింలు మరియు యూదులలో ఏర్పడిన అప్పటి యుద్ధ స్థితిని బట్టి అనుసరించిన ఈ పద్ధతి సమాజ శాంతికి మేలైనది, ఉత్తమమైనదని తెలుస్తుంది.

హుజూరె అన్వర్ ముగింపులో ఇట్లనిరి. మిగిలిన మరి కొన్ని సంఘటనలను నేను తర్వాత ప్రస్తావింతును. ఇన్‌షాఅల్లాహ్.

اَلْحَمْدُ لِلّٰہِ نَحْمَدُہٗ وَنَسْتَعِیْنُہٗ وَنَسْتَغْفِرُہٗ وَنُؤْمِنُ بِہٖ وَنَتَوَکَّلُ عَلَیْہِ۔ وَنَعُوْذُ بِاللّٰہِ مِنْ شُرُوْرِ اَنْفُسِنَا وَمِنْ سَیِّئَاتِ اَعْمَالِنَا۔ مَنْ یَّھْدِہِ اللّٰہُ فَلَا مُضِلَّ لَہٗ وَمَنْ یُّضْلِلْہُ فَلَا ھَادِیَ لَہٗ۔ وَنَشْھَدُ اَنْ لَّآ اِلٰہَ اِلَّا اللّٰہُ وَنَشْھَدُ اَنَّ مُحَمَّدًا عَبْدُہٗ وَرَسُوْلُہٗ۔ عِبَادَ اللّٰہِ رَحِمَکُمُ اللّٰہُ! اِنَّ اللّٰہَ یَاْمُرُ بِالْعَدْلِ وَالْاِحْسَانِ وَاِیْتَآءِ ذِی الْقُرْبٰی وَیَنْھٰی عَنِ الْفَحْشَآءِ وَالْمُنْکَرِ وَالْبَغْیِ۔ یَعِظُکُمْ لَعَلَّکُمْ تَذَکَّرُوْنَ۔ اُذْکُرُوا اللّٰہَ یَذْکُرْکُمْ وَادْعُوْہُ یَسْتَجِبْ لَکُمْ وَلَذِکْرُ اللّٰہِ اَکْبَرُ۔

*(Summary: Office Nashr-o-Isha'at, Translation: Incharge Telugu Desk)*